అందని 'ఉపాధి' కూలి

- రెండు నెలలుగా కూలీల ఎదురుచూపు
- వెంటనే చెల్లించాలని డిమాండ్


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బోథ్: కూలీలకు భరోసా కల్పించేందుకు, వారిని ఆర్థికంగా కొంత బలంగా చేయడానికి, వలసలను నివారించడానికి జాతీయ ఉపాధిహామీ పథకం దేశ వ్యాప్తంగా అమలువుతోంది. ముఖ్యంగా పని దొరకని వేసవి కాలంలో వారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం అమలవుతోంది. వర్షాకాలంతో పాటు చలికాలం కూలీలకు దొరికినా, ఎండా కాలంలో వ్యవసాయం సాగు తక్కువగా ఉండటంతో ప్రభుత్వం పనులను గుర్తించి ఉపాధి కూలీలకు ఉపాధిని కల్పించి ఆసరాగా ఉంటోంది. అయితే కూలీ డబ్బులు మాత్రం ఆలస్యంగా చెల్లిండంతో ఇబ్బంది పడుతున్నారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన కూలీ డబ్బులు ఇంతవరకు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..
ఆదిలాబాద్ జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఇంకుడు గుంతల తవ్వకాలు, పంట కాల్వల్లో పూడికతీత, చెక్ డ్యాంలకు మరమ్మతులు, పొలాలకు మట్టిదారులు, కందకాలు తవ్వడంతో పాటు ఇతర పనులు ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే పని ప్రాంతాలకు వెళ్లి కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నిత్యం 75160 మంది ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వీరికి మార్చిలో ఉపాధి హామీ కూలీ డబ్బులు చెల్లించినప్పటికీ ఏప్రిల్, మే నెలలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రతీ 15 రోజులకు ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా.. రెండు నెలలయినా డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

అప్పులు చేస్తున్నాం



నిత్యం పనులకు వెళితేనే కుటుంబం గడుస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళుతున్నాం. గత రెండు నెలలకు సంబంధించిన కూలీ డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదు. దినసరి ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యావసర సరుకులు కొనుగోలు తదితరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది.
– మానాల రాజేశ్వర్, సూర్యనగర్, సొనాల మండలం

డబ్బులు చెల్లించాలి



రెండు నెలలుగా ఉపాధిహామీ కూలీ చేసినా డబ్బులు చెల్లిండం లేదు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. అప్పులు తీసుకువచ్చి జీవనం సాగిస్తున్నాం. సకాలంలో వేతనాలు ఇవ్వాలి.
– గుడిసె సాయన్న, సూర్యగనర్, సొనాల మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఉపాధిహామీ వేతనాల విడుదల చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. త్వరలోనే కూలీలకు కూలీ డబ్బులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి.
– రవీందర్, డీఆర్‌డీవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం


మోడల్ స్కూల్‌లో రంగులు వేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: వేసవి సెలవు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. మండలంలో 29 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. హై స్కూల్‌లు 6, ప్రాథమికోన్నత పాఠశాలలు 11, ప్రాథమిక పాఠశాలలు 12, గిరిజన ఆశ్రమ పాఠశాలలు మూడు ఉన్నాయి. సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా మండలంలోని కొన్ని పాఠశాలలో బుధవారం అక్కడి సిబ్బంది రంగులు వేయించడం, చెత్త తొలగించడం, దుమ్ముధూళి తొలగించారు.

జొన్నల డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలి

బోథ్: మార్క్‌ఫెడ్‌కు రైతులు విక్రయించిన జొన్న డబ్బులకు రైతుల ఖాతాల్లో జమ చేయాలని బోథ్ టీడీపీ మండల కన్వీనర్ మల్లెపూల శివారెడ్డి డిమాండ్ చేశారు. రైతులకి ఒక పక్క పంట రుణమాఫీ కాలేదని, సకాలంలో పంట పెట్టుబడి కింద ఆర్థిక భరోసా సాయం అందక, మరొక పక్క బ్యాంకు రుణాలు అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. డబ్బులు జమ చేయలేక పోతే రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు వడ్ల చందు, అమీరోద్దిన్ పాల్గొన్నారు.

ఐఐటీ ఫౌండేషన్‌కు విద్యార్థుల ఎంపిక

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఐఐటీ ఫౌండేషన్‌కు ఎంపికయ్యారు. సీవోఈ పాఠశాలల్లో 8వ తరతగతిలో ఐఐటీ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జి. స్వర్ణాంజలి, డి.సాక్షి, అక్షిత, ఆర్. సాత్విక, బి. సాయిప్రసన్న, వై. శ్రీనయ, బి.కావేరి, దివ్యశ్రీ ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ సంగీత స్వీట్లు తినిపించి అభినందించారు.

ప్రయాణికులకు వైద్య పరీక్షలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ బస్‌స్టేషన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్, టీబీ, హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ప్రయాణికులు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, స్యూర్ ఎన్జీవో ప్రతినిధి భానురేఖ, ఏఎన్‌ఎం రాధిక, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ పోశెట్టి పాల్గొన్నారు.

కేస్లాగూడలో అమ్మమాట.. అంగన్‌వాడీబాట

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ పరిధిలోని కేస్లాగూడ గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట నిర్వహించారు. రెండు సంవత్సరాలు నిండిన చిన్నారులకు, పిల్లల తల్లులకు ఘన స్వాగతం పలికి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వందన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.

ముఖరా(కె)లో రెవెన్యూ సదస్సు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యల ఉన్న రైతుల నుంచి తహసీల్దార్ సత్యనారాయణరావు దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సమస్యల ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏవైనా భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇచ్చోడ: బీడు భూములకు సాగు నీరిచ్చిన కేసీఆర్ అపర భగీరథుడని ముఖరా(కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి అన్నారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరువుతున్న సందర్భంగా బుధవారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అలాంటి కేసీఆర్ అనవాళ్లను చెరిపేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీ గాడ్గే సూభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన


నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఆదిలాబాద్‌రూరల్: ఇందిరమ్మ పథకంలో మొదటి విడత మంజూరైన ఇంటి నిర్మాణాలు చేపడుతున్న మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో హౌజింగ్ పీడీ బసవేశ్వర్, మండల స్థాయి అధికారులు బుధవారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ హౌజింగ్ ఎండీ ఆదేశాల మేరకు మొదటి విడత పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు లబ్ధిదారుడి ఫొటో యాప్‌లో క్యాప్చరింగ్ చేసే విధానంపై శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఏఈలు బచి, సుధాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల కొలతలు, మార్కౌట్ లపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని నవేగావ్‌లో ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్, కొలతలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు, అత్యవసరంగా ఇందిరమ్మ ఇళ్లకు పంచాయతీ కార్యదర్శులు మార్కౌట్ ఇచ్చి పనులు ప్రారంభించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

త్వరగా పూర్తి చేయాలి
నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజీవీర్ అన్నారు. బుధవారం మండలంలోని వాంకిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనితీరుపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల దశలను ఏఈ గణేష్ వివరించారు. ఎంపీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ
నేరడిగొండ మండలంలోని పట్‌పటితండా, చిన్న బుగ్గారంలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బోథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్ బుధవారం ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవీర్, రాజశేఖర్ రెడ్డి, ఆడే రాంచందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్


రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో

నేరడిగొండ: వైద్యశాఖ అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి


మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి గిరిజనులను, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తూ మావోయిస్టులని కాల్చి చంపడం, బూటక ఎన్‌కౌంటర్లు చేయడం సరికాదన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కోరారు. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని, పాకిస్తాన్, చైనా దేశాలతో శాంతి చర్చలు జరిపేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది కానీ ఆపరేషన్‌ను ఆపి చర్చలకు ఎందుకు పిలవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, అశోక్, తబ్రేజ్‌ఖాన్ పాల్గొన్నారు.

చిత్తగూడలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నార్నూర్: గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామంలో బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన సంస్థ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. రాంప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు కొన్నప్పుడు రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, ఏవో యంకన్న, ఏఈవో సంధ్య, రాథోడ్ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రత పూజలు


పూజలు చేస్తున్న మహిళలు


మర్రిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు


వటవృక్షం వద్ద మహిళల పూజలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బుధవారం వటసావిత్రి వ్రత పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమీపంలోని ఆలయాల వద్దగల మర్రి వృక్షాలకు దారం చుడుతూ 108 ప్రదక్షిణలు చేసి, తమ భర్తలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం పరస్పరం మహిళలు నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ ఈ వ్రత పూజలో భాగంగా మర్రి చెట్టును పూజిస్తే సాక్షాత్తు త్రిమూర్తులను పూజించిన ఫలం దక్కుతుందని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధి కారి రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పారిశుద్ధ్య వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా మురికి కాలువలను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. ఎంపీడీవో జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ కళాశాలలో మిగిలి ఉన్న ఎంపీసీ, బైపీసీ సీట్ల భర్తీకి ఈనెల 16 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన గిరిజన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

డయాలసిస్ బాధితులకు అండగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్: డయాలసిస్ బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. డయాలసిస్‌తో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న వారికి జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్, లింగారెడ్డి, జహీర్, అశన్న, మహ్మద్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన గెస్ట్ లెక్చరర్‌గా బోధించేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. 65ఏళ్ల లోపు ఉన్న రిటైర్డ్, నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెలకు రూ.23,400 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే కోకరికులమ్ అభ్యర్థులకు రూ.15,600 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అన్నారు. మంగళవారం గుండాలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పరిసర ప్రాంతాల ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు, ఈగల భారీన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఎంఎల్‌పీహెచ్ సంగీత, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీకా కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు టీకాలు అందేలా సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీలు చూడాలన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

'కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం'


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

బోథ్: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ రావు అరెస్ట్ అప్రజాస్వామికమని బోథ్ ప్రెస్‌క్లబ్ సభ్యులు అన్నారు. బుధవారం జ ర్నలిస్టులు నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలను జర్నలిస్టుల మీద రుద్ది ఇబ్బందికి గురిచేయడం సరైనది కాదన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం అయితే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కూలర్‌లో మంటలు.. ఇద్దరికి గాయాలు
ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజీతండా ఎక్స్‌రోడ్డు గ్రామంలో కూలర్‌లో మంటలు చెలరేగిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. రాథోడ్ అరుణ ఇంట్లోలో వోల్టేజీ కారణంగా ఒక్కసారిగా కూలర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. అరుణను కాపాడే ప్రయత్నంలో ఆమె సోదరురు జాదవ్ పృథ్వీరాజ్‌కు కూడా గాయపడ్డాడు.

టిప్పర్లు సీజ్
తలమడుగు: మండలంలోని కజ్జర్ల శివారులో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. మోదీ పాలన అన్ని దేశాలకు ఆదర్శంగా ఉందన్నారు. నాయకులు బాలాజీ, అమృత్ రావు, మాటే నాందేవ్, భగవాన్, పెంట గంగాధర్, కృష్ణ,కుమార్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకులకే విలువనిస్తున్నారు'
సిరికొండ: మండల కేంద్రంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ధ్రువపత్రాల పంపిణీ విషయంలో ఇందిరమ్మ కమిటీలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకే అధికారులు విలువనిస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్ మాట్లాడారు. లబ్ధిదారుల పేర్లకు బదులు ఇతర పేర్లను చేర్చారని ఆరోపించారు.

మంత్రి వివేక్‌ను కలిసిన నాయకులు
తలమడుగు: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నియమితులైన గడ్డం వివేక్‌ను బుధవారం మాజీ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ లోక భూమరెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి
ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యకర్త మహేశ్ జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. మూడోరోజు బుధవారం 850 మంది అభ్యర్థులకుగాను 670 మంది హాజరైనట్లు ప్రభుత్వ డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈనెల 13 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు

భీంపూర్: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్త మోహన్ దాస్ పేర్కొన్నారు. మండలంలోని కైరిగూడ గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి లభ్యత, వినియోగం, క్రిమిసంహారక మందుల వాడకం, సాగులో జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఫీజు రాయితీ ఇవ్వాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాని జర్నలిస్ట్ జేఏసీ చైర్మన్ నూకల దేవేందర్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌గౌడ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇందులో జర్నలిస్టులు వెంకటేశ్, సురేశ్, సుధాకర్, రవి, కిరణ్ రెడ్డి, మురళీకృష్ణ, అశోక్, మహేందర్, దత్తాత్రి, సుభాష్ తదితరులున్నారు.

'అగ్రకుల రాజ్యానికి చరమగీతం పాడుదాం'

బోథ్: అగ్రకుల రాజ్యానికి చరమగీతం పాడుదాం అని ఎస్సీ, ఎస్టీ, బీసీ రాజ్యాధికార జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మా భూమి రథయాత్ర నిర్వహించారు. దొరల రాజ్యంలో పేదలకు విద్య, వైద్యం అందించకుండా చంపుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఎప్పటినుంచో సమానత్వ యుద్ధాలు జరుగుతున్నప్పటికీ రెడ్డి రావులు సమానత్వ సూత్రాన్ని పాటించడం లేదన్నారు. నాయకులు నరేశ్, అనిల్, వెంకటేశ్, ప్రవీణ్, పోతన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన


చిన్నారులతో ఐసీడీఎస్ సిబ్బంది

గుడిహత్నూర్: చిన్నారులకు ఆట పాటలతో విద్యా బోధన అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. మండలంలోని గురుజ గ్రామంలో బుధవారం అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించి గ్రామంలో చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధి జరిగేలా అన్ని విధాలా చర్యలు తీసుకోవడంతో పాటు వయస్సుకు తగ్గ విద్యను బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంఘమిత్ర, గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు జయంతి, అనురాధ, చిన్నారులు, బాలబాలికలు పాల్గొన్నారు.